సాక్షి
మంచిర్యాల

సోమవారం ¦ 19 ¦ జూన్ ¦ 2023



'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో మెరిసిన విద్యార్థులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మెరిశారు. జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించారు. ర్యాంక్‌ల ప్రాతిపదికన దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీట్లు పొందనున్నారు. IIలో ▸

రేపు ఒలింపిక్ రన్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 8 గంటలకు ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాంచందర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు ఐబీ చౌరస్తా నుంచి మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు రన్ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని క్రీడా సంఘాలకు చెందినవారు, పీఈటీ, పీడీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.7 /31.3

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం 10 గంటల నుంచే వేడి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం తర్వాత అధికమవుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'బుగ్గ'లో జూనియర్ సివిల్ జడ్జి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి కుటుంబ సభ్యులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జె.ముఖేశ్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. న్యాయమూర్తికి ఆలయం తరఫున అర్చకులు వేదమంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. ముఖేశ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో వారిని సన్మానించారు. ఆలయ విశిష్టతను జడ్జి అడిగి తెలుసుకున్నారు. బుగ్గ ప్రాంతం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉందన్నారు.

జిల్లాలో సాహిత్యానికి కొదువలేదు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో సాహిత్యానికి కొదువ లేదని సాహితీ సంరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాల ఓవర్ బ్రిడ్జి సమీపంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆవరణలో సాహితీ సంరక్షణ సమితి సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవితాగానం చేశారు . ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎందరో కవులు, కవయిత్రులు నాణ్యమైన కవిత్వాన్ని అందిస్తూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం తెలంగాణ భాషకు అత్యంత ప్రాచుర్యం లభిస్తుందన్నారు. ఈసందర్భంగా కవులు హైమావతి, బెల్లాల సుగుణాకర్, అడ్డగూరి శ్రీలక్ష్మి, భూపతి సంతోష్, పెద్ది భరత్, శ్రీనాథ్ గౌడ్, శ్రీనివాస్, సృజన, చంద్రశేఖర్ తదితరులు చేసిన కవితాగానం అలరించింది.

జీవో 21ని గెజిట్ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న సెక్యూరిటీ గార్డ్స్

చెన్నూర్: తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కోసం ప్రభుత్వ విడుదల చేసిన జీవో 21ను గెజిట్ చేయాలని కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందించామని తెలంగాణ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్స్ మంచిర్యాల, కుమురంభీ జిల్లాల అధ్యక్షుడు పిల్లలమర్రి రమేశ్ తెలిపారు. మార్కెట్ కమిటీల్లో ఉన్న ఏజెన్సీలను రద్దు చేసి ఈఎస్‌ఐ, పీఎఫ్ జీతభత్యాలు నేరుగా కార్యాలయాల ద్వారా చెల్లించాలని కోరారు. ప్రతీ సెక్యూరిటీ గార్డ్‌కు బీమా సాకర్యం కల్పించా లన్నారు. సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు భద్రయ్య, జిల్లా కోశాధికారి రమే శ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నా యకులు జనార్దన్, స్వప్న, వెంకన్న, భాస్కర్, దినేశ్, సీఐటీయూ నాయకులు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

విజేతలకు పురస్కారం



ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో విద్యార్థులు..

లక్సెట్టిపేట: స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు అంజలి, అహల్య, వరలక్ష్మి గత డిసెంబర్‌లో నాగ్‌పూర్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ సైకిల్‌పోలో పోటీల్లో ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయి గిరిజనోత్సవాల సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సత్యవతిరాథోడ్ పురస్కారాలు ప్రదానం చేశారు. ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు అందించినట్లు పాఠశాల హెచ్‌ఎం శోభ, పీఈటీ బండ జీవరత్నం తెలిపారు.

త్వరలో రేవంత్‌రెడ్డి పర్యటన

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి త్వరలో పర్యటిస్తారని ఈమేరకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకురాలు రామిల్ల రాధిక తెలిపారు. హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో ఆదివారం కలిసి చెన్నూర్ నియోజకవర్గంలోని సమస్యలను, జరుగుతున్న దోపిడీ వివరించారు. మందమర్రిలో లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించి ప్రారంభిస్తే వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. గ్రామ సమస్యలపై, జరుగుతున్న దోపిడీపై ప్రజలతో కలిసి పోరాడాలని రేవంత్ రెడ్డి సూచించినట్లు రాధిక తెలిపారు.

అమృత్ ధారలు



మంచిర్యాలకు అందించే తాగునీటి ఫిల్టర్‌బెడ్

- మున్సిపాలిటీల్లో తాగునీటికి భారీగా నిధులు
- అమృత్ 2.0 ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల
- ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల విస్తరణ
- పురపాలికల్లో తీరనున్న తాగునీటి కష్టాలు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో వచ్చే 30 ఏళ్ల వరకు ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి అమృత్ 2.0 పథకం కింద ఇటీవలే నిధులు విడుదల చేశాయి. ఏడు పట్టణాల్లో తాగునీటి సమస్యను తీర్చడం , పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరమైన వాటర్ ట్యాంకులు నిర్మించి, కాలనీలకు సరిపడా పైప్‌లైన్లను విస్తరించేందుకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు.

మూడు పాతవి, నాలుగు కొత్తవి..

జిల్లాలో మూడు మున్సిపాలిటీలు పాతవి కాగా, 2018లో కొత్తగా నాలుగు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. లక్సెట్టిపేట్, నస్పూరు, క్యాతన్‌పల్లి, చెన్నూరు కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో ఎక్కువగా తాగునీటి సమస్య ఉంది. గతంలో గ్రామపంచాయతీలుగా ఉన్నప్పుడు తాగునీటి సరఫరా అంతంతమాత్రంగానే ఉండేది. మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయినా సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. తాజాగా అమృత్ 2.0 పథకం కింద కోట్ల రూపాయల నిధులు విడుదల కావడంతో పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా ప్రకారంగా మరో 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య రాకుండా పనులు చేపట్టనున్నారు. భవిష్యత్ అవసరాలకు సరిపడా తాగునీటిని అందించాలంటే ప్రస్తుతం మున్సిపల్ చట్ట ప్రకారం మున్సిపాలిటీల్లో ఒక్కో వ్యక్తికి 135 లీటర్ల చొప్పున తాగునీటిని సరఫరా చేయాలి.

మిషన్ భగీరథ ఉన్నా..

మిషన్ భగీరథ ద్వారా ట్యాంకులు నిర్మించి, పైపులైన్ వేస్తున్నా, పూర్తిస్థాయిలో ఇంటింటికి తాగునీరు అందడం లేదు. అమృత్ పథకం కింద విడుదలైన నిధులతో కొత్తగా నీటి ట్యాంకులు నిర్మించి, కొత్తగా పైపులైన్లు వేయనున్నారు. ఈమేరకు త్వరలోనే టెండర్లు పిలిచి ప్రజారోగ్య శాఖ ద్వారా పనులను చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే వచ్చే ఏడాది వేసవి నాటికి ఏడు మున్సిపాలిటీల్లోనూ తాగునీటి సమస్య తీరే అవకాశం ఉంది.

అమృత్ 2.0 కింద మున్సిపాలిటీల వారీగా విడుదలైన నిధులు..

మున్సిపాలిటీ	విడుదలైన నిధులు
మంచిర్యాల	రూ.48.5 కోట్లు
లక్సెట్టిపేట్	రూ.20 కోట్లు
నస్పూర్	రూ. 73 కోట్లు
బెల్లంపల్లి	రూ. 51.5 కోట్లు
మందమర్రి	రూ. 30.5 కోట్లు
చెన్నూర్	రూ.31 కోట్లు
క్యాతన్‌పల్లి	రూ.41.5 కోట్లు

తీరనున్న సమస్య

ప్రస్తుతం జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ప్రతీరోజు తాగునీటిని అందించలేని పరిస్థితి ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా చేయడం పాలకవర్గాలకు తలనొప్పిగా మారుతోంది. పట్టణ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతుండగా, ఎప్పుడో వేసిన పైపులైన్లు, నిర్మించిన ట్యాంకర్ల ద్వారా సరిపడా తాగునీరు సరఫరా చేయలేకపోతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోనే లక్సెట్టిపేట్, మంచిర్యాల, నస్పూరు, చెన్నూరు మున్సిపాలిటీలు ఉన్నాయి, గోదావరి నుంచే క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, మందమర్రి మున్సిపాలిటీలకు తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు తరచూ లీక్ అవుతున్నాయి. దీంతో తరచూ తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గోదావరి నదిని ఆనుకుని ఉన్న మున్సిపాలిటీల్లోనూ తాగునీటి సమస్య తలెత్తుతోంది. పట్టణంలోని ఒక్కో వ్యక్తికి నిత్యం 135 లీటర్ల నీటిని అందించాల్సి ఉన్నా, కనీసం 100 లీటర్లు కూడా ఇవ్వలేని పరిస్థితి.

టెండర్లు పూర్తికాగానే పనులు..

మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యలను తీర్చేందుకు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వచ్చే 30 ఏళ్ల నాటికి ప్రజలందరికీ సరిపోయేలా తాగునీటి పనులను చేపట్టేందుకు అమృత్ 2.0 పథకం కింద విడుదల చేసింది. ఆ నిధులతో చేపట్టే పనులకు త్వరలో టెండర్లు పిలుస్తాం. ఆ వెంటనే పనులు ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తిచేస్తాం. అవసరమైన చోట ట్యాంకులు నిర్మిస్తాం. పైప్‌లైన్ నిర్మాణం చేపడతాం. శివారు కాలనీలకు ఇకపై తాగునీటి సమస్య ఉండదు.

– శ్రీనివాస్, ప్రజారోగ్యశాఖ డీఈఈ

ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు



మిషన్ భగీరథ ప్లాంటు పనితీరును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్

- కలెక్టర్ బదావత్ సంతోష్
- గుడిపేటలో నీళ్ల పండుగ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవల్లో భాగంగా హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ ప్లాంటు వద్ద ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటుకు ముందు కేవలం 54 ఆవాసాలకు మాత్రమే తాగునీటి సౌకర్యం ఉండేదన్నారు. 9 ఏళ్లలో గణనీయ అభివృద్ధి సాధించి 667 ఆవాసాలకు మంచినీరు సరఫరా చేపడుతున్నట్లు తెలిపారు. 9 ఓహెచ్‌డీ ట్యాంకులు, 32 ట్యాంకులు నిర్మించుకున్నామని పేర్కొన్నారు. 100 కిలో మీటర్ల గ్రిడ్ పైప్‌లైన్‌ను 1,525 కిలో మీటర్లకు పెంచుకోవడం జరిగిందని అన్నారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్ అందించేందుకు 201 కిలో మీటర్లు ఉన్న పైప్‌లైన్ వ్యవస్థ ప్రస్తుతం 2,729 కిలో మీటర్ల మేర విస్తరించామని తెలిపారు. జిల్లాలో గతంలో 418 ఓహెచ్‌ఆర్ ట్యాంకులు ఉండగా ప్రస్తుతం 981 ఓహెచ్‌ఆర్ ట్యాంకులకు పెంచుకోగా 8,600 నీటి కుళాయి కనెక్షన్లకు గాను 1.80 లక్షలకు పెంచామన్నారు. దేశంలో ఇంటింటికీ తాగునీరు అందిస్తున్న రాష్ట్రం మనదే అని పేర్కొన్నారు. అనంతరం మిషన్ భగీరథ ఇన్‌ఫ్రా, గ్రిడ్ అధికారులను సన్మానించారు. వేడుకల్లో అదనపు కలెక్టర్ రాహుల్, మిషన్ భగీరథ ఇన్‌ఫ్రా ఈఈ అంజన్‌కుమార్, గ్రిడ్ ఈఈ మధుసూదన్, డీఆర్డీవో శేషాద్రి, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, ఎంపీపీ స్వర్ణలత, సర్పంచులు లగిశెట్టి లక్ష్మి, మధుసూదన్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

ఫిట్.. లెస్..!

- నెమ్మదిగా సాగుతున్న వాహన పరీక్షలు
- నిర్లక్ష్యం వీడని పాఠశాలల యాజమాన్యాలు
- జిల్లా వ్యాప్తంగా 311 బస్సులు



ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్న రవాణా అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థులను తరలించే వాహనాలకు యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. పాఠశాలలు ప్రారంభమై వారం గడిచినా యాజమాన్యాలు ఫిట్‌నెస్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. అయినా రవాణా అధికారులు ఈనెల 15వ తేదీ వరకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అయినా కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు చెందిన 311 బస్సులు ఉండగా, ఈనెల 17 వరకు 180 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. ఇంకా 131 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సి ఉంది.

చర్యలకు సిద్ధమవుతున్న రవాణా అధికారులు..

జిల్లాలోని విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించడం ఇప్పటికే ప్రారంభించారు. కానీ రవాణా శాఖా కార్యాలయానికి ఫిట్‌నెస్ పరీక్షల కోసం బస్సులు రావడం లేదు. దీంతో ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కే వాహనాలపై చర్యలకు రవాణా అధికారులు సిద్ధమవుతున్నారు. ఇకనైనా విద్యాసంస్థల యజమాన్యాలు త్వరగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. లేనిపక్షంలో రవాణా శాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

ఫిట్‌నెస్ నిబంధనలివీ..

- బస్సు మంచి కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలి. 15 ఏళ్ల జీవిత కాలం దాటని బస్సు అయి ఉండాలి. బస్సుకు పసుపురంగు తప్పనిసరిగా ఉండాలి.
- బస్సు స్టీరింగ్, బ్రేకులు, టైర్లు, ఇండికేటర్లు, వైపర్లు, అత్యవసర ద్వారం, కిటికీలకు గ్రిల్స్ అమర్చడం, పిల్లలు బస్సు ఎక్కేందుకు, దిగేందుకు అనువుగా ఉండాలి.
- ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి. సైడ్ మిర్రర్లు, లైట్లు, బస్సు వెనక ఎరుపు రంగు రేడియం టేపు, ముందు తెలుపు రంగు రేడియం అతికించి ఉండేలా చూడాలి.

జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థల బస్సులు	311
ఫిట్‌నెస్ పూర్తయిన బస్సులు	180
ఇంకా ఫిట్‌నెస్ కావాల్సినవి	131

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్..



15వ తేదీలోగా విద్యా సంస్థలు తమ బస్సులను ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించాం. యాజమాన్యాల నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు. ఫిట్‌నెస్ కోసం బస్సులు వస్తే వెంటనే చేసి పంపిస్తాం. అన్ని పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలి. బస్సులను పరిశీలించాకే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తాం. నిబంధనలు పాటించని బస్సులు రోడ్లపైకి రావొద్దు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కితే సీజ్ చేస్తాం.

– గుర్రం వివేకానంద్‌రెడ్డి, సీనియర్ ఎంవీఐ, మంచిర్యాల

గుడ్డుపై.. స్టాంప్



ప్రభుత్వం సరఫరా చేసిన ముద్రతో ఉన్న కోడిగుడ్లు

- పౌష్టికాహారంపై ప్రత్యేక 'ముద్ర'
- అంగన్‌వాడీ కేంద్రాలకు లోగోతో సరఫరా
- పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు

కోటపల్లి/పెంచికల్‌పేట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంలో భాగంగా ప్రభుత్వం కోడిగుడ్లను అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే కొందరు వీటిని పక్కదారి పట్టిస్తున్నారు. కొన్నిచోట్ల సరఫరాదారులు కుళ్లిన, చిన్న పరిమాణం కలిగిన గుడ్లు సరఫరా చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అక్రమాలను నియంత్రించేందుకు కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. లబ్ధిదారులకు మాత్రమే అందించేలా పకడ్బందీ చర్యలు షురూ చేసింది. కోడిగుడ్లపై 'అంగన్‌వాడీ గుడ్లు తెలంగాణ ప్రభుత్వం' అని ప్రత్యేక ముద్ర వేసి పంపిణీ చేస్తోంది.

పక్కదారి పట్టకుండా..

ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే మూడేళ్లలోపు చిన్నారులకు ప్రభుత్వం బాలామృతం, గుడ్లను అందజేస్తోంది. అలాగే ఆరేళ్లలోపు పిల్లలకు గుడ్లు, పప్పు, కూరగాయలు, భోజనం, కుర్‌కురే, పల్లిపట్టి వంటివి ప్రతీరోజు అందేలా చూస్తోంది. బరువు తక్కువగా, బలహీనంగా ఉన్న వారికి రెట్టింపు పౌష్టికాహారం సైతం అందజేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి రోజుకు ఒకటి చొప్పున గుడ్డు ఉడికించి ఇస్తున్నారు. వివిధ కారణాలతో అందుబాటులో లేక ఎవరైనా కేంద్రాలకు రాకపోతే వారికి అందజేసినట్లు రికార్డుల్లో రాసుకొని దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇకపై ఎలాంటి అవకతవకలు జరగకుండా విడతల వారీగా ఒక్కో రంగుతో ముద్ర వేస్తున్నారు.

మూడు రంగుల్లో..

జూలై నుంచి ఫిబ్రవరి వరకు నెలకు రెండు విడతలుగా గుడ్లు అందిస్తారు. మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో గుడ్లు త్వరగా పాడైపోయే ప్రమాదం ఉండటంతో నెలకు మూడు దఫాలుగా సరఫరా చేస్తారు. వేసవిలో అందించే గుడ్లపై నీలం, ఎరుపు, ఆకుపచ్చ రంగులు, చలికాలం, వర్షాకాలం అందించే గుడ్లపై ఎరుపు, ఆకుపచ్చ రంగులను ముద్రిస్తారు. ముద్ర మధ్యలో అంగన్‌వాడీ కేంద్రం ఏ జోన్ పరిధిలోకి వస్తుందో ఆ జోన్ నంబర్లను కూడా స్పష్టంగా కనిపించేలా 5 మిల్లీమీటర్ల పొడవు, వెడల్పుతో ముద్రిస్తున్నారు. ప్రత్యేకమైన ముద్ర వేసిన ఈ గుడ్లనే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రాకింగ్ సిస్టం ద్వారా సరఫరా

అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే గుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కమోడిటీ సప్లయ్ ట్రాకింగ్ అనే ప్రత్యేక విధానం ద్వారా బ్యాచ్‌ల వారీగా సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ముద్ర ఉన్న కోడిగుడ్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, ఇతరులు భయపడతారని, గుడ్ల అక్రమ రవాణా, వినియోగాన్ని ప్రాథమిక దశలోనే కట్టడి చేయొచ్చని, తద్వారా అసలైన లబ్ధిదారులకు మాత్రమే గుడ్లు అందజేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

పారదర్శకంగా పంపిణీ...

పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా ముద్ర వేసి సరఫరా చేస్తున్న గుడ్లనే లబ్ధిదారులకు అందిస్తున్నాం. బ్యాచ్ నంబరు ఉన్న నేపథ్యంలో లబ్ధిదారులకు అందించడం కూడా సులువు అవుతుంది.

– హసీనా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పెంచికల్‌పేట్

పక్కాగా పౌష్టికాహారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం నెలనెలా కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నాం. సరఫరాలో అక్రమాలు లేకుండా పంపిణీ చేసేందుకు మూడు రంగుల్లో ముద్ర వేస్తున్నాం. దీంతో లబ్ధిదారులకు పక్కాగా పౌష్టికాహారం అందుతుంది.

– మనోరమ, సీడీపీవో, చెన్నూర్

ఉమ్మడి జిల్లాలో 4వేల కేంద్రాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4 వేలకుపైగా అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో 19,144 మంది గర్భిణులు ఉన్నారు. 19,779 మంది బాలింతలు, 1,95,043 మంది చిన్నారులు నమోదై ఉన్నారు. వీరందరికీ నిత్యం పౌష్టికాహారంతోపాటు కోడిగుడ్లు పంపిణీ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలు..

జిల్లా	కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
మంచిర్యాల	969	4,701	3,942	39,760
నిర్మల్	926	5,809	6,405	61,298
కుమురంభీం	973	4,858	5,227	44,417
ఆదిలాబాద్	1256	3,776	4,205	49,568



ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న కమలాకర్

మంచిర్యాలఅర్బన్: పాత పెన్షన్ స్కీంను 2004, సెప్టెంబర్ 1కి ముందు నోటిఫికేషన్ వచ్చి నియామక ప్రక్రియ ప్రారంభమైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని 2003 ఉపాధ్యాయ, ఉద్యోగ పాత పెన్షన్ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీపీఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్, పెన్షన్ సాధన సమితిరాష్ట్ర నాయకుడు గట్లశ్రీనివాస్ మాట్లాడుతూ 2004 కంటే ముందే నోటిఫికేషన్ వచ్చి నియామక ప్రక్రియ ప్రారంభమైనా కేవలం అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చాల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ ఆలస్యమై 2005లో నియామకం అయ్యారన్నారు. ఈలోగా 2004, సెప్టెంబర్ ఒకటి నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం పేరుతో కొత్త పెన్షన్ ప్రారంభమైందన్నారు. సాంకేతిక కారణాలతో నియామకం ఆలస్యమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ ఇవ్వొచ్చని కేంద్ర ప్రభుత్వ ఇటీవల మెమో నంబర్ 57 జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జీవో ప్రకారం 31 ఆగస్టు 2003 లోపల వీరందరినీ పాత పెన్షన్‌లోకి చేర్చటానికి అవకాశం ఇవ్వటం జరిగిందన్నారు. సమావేశంలో పాత పెన్షన్ సాధన సమితి నాయకుడు రమేశ్, మోహన్‌రావు, రమేశ్, సతీశ్, విజయలక్ష్మి, సత్యమ్మ, రమాదేవి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు



చిన్నారుల నృత్య ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో స్థానిక వైశ్య భవన్‌లో టాలెంట్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈపోటీలను ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు ప్రారంభించారు. 200 మంది కళాకారులు పాల్గొన్నారు. సినిమా, శాస్త్రీయ, జానపద నృత్యప్రదర్శనలతో అలరించారు. రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్, దుర్గం పోశం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దుర్గం రాజేశ్, అకాడమీ గౌరవ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

దండేపల్లి: మండలంలోని జైతుగూడకు చెందిన మర్సుకోళ్ల కృష్ణ (29)అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్సై కుందారపు ప్రసాద్ వివరాల ప్రకారం... ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే కృష్ణ ఈ నెల 15న ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లాడు. ఈ నెల 17న రాత్రి కుంటలగూడ కట్ట సమీపంలోని సదర్‌రాజుల గుడి దగ్గర ఓ మృతదేహం కనిపించింది. ఎలా చనిపోయాడు అనేది మాత్రం తెలియరాలేదు. మృతిపై అనుమానం ఉందని మృతుడి సోదరుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో రిటైర్డు కార్మికుడు..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని హన్మాన్‌బస్తీకి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు రెమ్మ కృష్ణ (58) విద్యుత్ షాక్‌తో మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వన్‌టౌన్ ఏఎస్సై తిరుపతి తెలిపారు. మూడు రోజుల క్రితం ఇంట్లోని కూలర్‌లో నీళ్లు పోస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్ తగిలి కృష్ణ మృతిచెందాడు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో కృష్ణ మృతి వివరాలు ఆలస్యంగా వెలుగు చూశాయి. కృష్ణ సింగరేణిలో పని చేసి గత జనవరి మాసంలో ఉద్యోగ విరమణ చేశాడు. ఆయన భార్య లావణ్య భర్తతో గొడవ పడి 13 ఏళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి కృష్ణ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

వాంకిడి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బల్లార్షాకు చెందిన గణేశ్‌నాయుడు (42) మహారాష్ట్ర వైపు నుంచి వాంకిడి వైపు స్కూటీపై వస్తున్న క్రమంలో మండలంలోని గణేష్‌పూర్ గ్రామానికి సమీపంలో నాలుగు వరుసల జాతీయ రహదారి–363పై రాత్రి 8.30 గంటల ప్రాంతంలో వాంకిడి వైపు నుంచి మహారాష్ట్ర వైపునకు వెళ్తున్న ఓ టెలికాం కేబుల్ వర్క్‌కు సంబంధించిన బులేరో వాహనం ఎదురుగా ఢీకొంది. దీంతో గణేష్‌నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108లో ఆసిఫాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో.. మెరిసిన విద్యార్థులు



రోహిత్



సత్యతేజ్

మిమ్స్ విద్యార్థుల ప్రతిభ..

మంచిర్యాలఅర్బన్: ఐఐటీ జెఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మిమ్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పి. రోహిత్ 2690, సత్యతేజ్ 4088 ర్యాంక్‌లు సాధించారని కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రాజు తెలిపారు. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శైలజ అభినందించారు.

- నేటి నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభం



సీఓఈ కళాశాల ముఖద్వారం



ఎనగందుల మౌర్య, సిలివేరు వినయ్, ముంజం అంజన్న, సొనకాంబ్లే లక్ష్మణ సిద్ధు, బత్తుల కార్తీక్, అలకటి గణేశ్, గట్టు శ్రీహర్ష

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మెరిశారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాల విద్యార్థులకు ధీటుగా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. ఈసారి సీఓఈ కళాశాల నుంచి మొత్తం 18మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వీరిలో ఏడుగురు విద్యార్థులు అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రాణించి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థుల్లో ఎనగందుల మౌర్య (957) ప్రిపరేటరీ ర్యాంకుతో కళాశాల టాపర్‌గా నిలువగా సిలివేరు వినయ్ (2,027), ముంజం అంజన్న (2,191), సొనకాంబ్లే లక్ష్మణ్ సిద్దు (2,495), బత్తుల కార్తీక్ (3,050), అలకటి గణేష్(5,295), గట్టు శ్రీహర్ష (5,832) జాతీయ స్థాయిలో ర్యాంకులు తెచ్చుకున్నట్లు సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. క్వాలీఫై అయిన విద్యార్థులకు సోమవారం నుంచి జరిగే జోసా కౌన్సెలింగ్‌లో ర్యాంక్‌ల ప్రాతిపదికన దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీ కళాశాలల్లో సీట్ల కేటాయించనున్నారు. విజయం సాధించిన విద్యార్థులను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపాల్ సైదులు, అధ్యాపకులు చందా లక్ష్మీనారాయణ, నాగిని శ్రీరామవర్మ, సుంకరి అర్జున్, మిట్టా రమేష్, సురేష్‌గౌడ్ ఎంతగానో కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

మెరుగైన బోధనతోనే అద్భుత ఫలితాలు



ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయడం, విద్యార్థులకు అన్ని అంశాలపైన సమగ్రమైన అవగాహన కలిగించడంతోనే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమంగా రాణిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అధ్యాపకులు అంకిత భావంతో విద్యాబోధన చేస్తున్నారు. ముందస్తుగా విద్యార్థులకు పోటీ పరీక్షలపై ఉండే భయాన్ని పోగొట్టడం సునాయసంగా అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారు.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్, సీఓఈ కళాశాల బెల్లంపల్లి

సత్తాచాటిన 'గిరి' విద్యార్థి



మానెపల్లి రవికుమార్

కోటపల్లి: మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన వి ద్యార్థి రవికుమార్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియాలో 16711 ర్యాంక్, రాష్ట్రంలో 164వ ర్యాంక్ సాధించాడు. రవికుమార్ 1 నుంచి 4వ తరగతి వరకు బొప్పారం గ్రామంలో చదివాడు. బీమారం ఎస్టీ హాస్టల్‌లో పదో తరగతి పాసై ఇంటర్ హైదరాబాద్‌లో గిరిజన సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యానభ్యసించి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలి పారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన రవికుమమార్‌ను సర్పంచ్ జెల్ల సతీశ్, ఆదివాసీ కులసంఘాల నాయకులు బండి రమేశ్, జేక శేఖర్, నగేశ్ అభినందించారు.

మెరిసిన తిర్యాణి విద్యార్థిని..



సానిక

తిర్యాణి: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో మండల కేంద్రానికి చెందిన బుర్ర మధుకర్–రాజ్యలక్ష్మిల కూమార్తె బుర్ర సానిక ఆల్ ఇండియా ఓబీసీ కోటాలో 2729 ర్యాంక్‌ను సాధించింది. సానిక కోచింగ్ సెంటర్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి సన్నద్ధమైందని తల్లిదండ్రులు తెలిపారు. ఈ సందర్భంగా సానికను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్, స్థానికులు అభినందించారు.

ఉత్తమ ప్రతిభ



దూస చేతన్

లక్ష్మణచాంద: దేశంలోని ఐఐటీ కళాశాలల్లో అడ్మిషన్స్ కోసం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఓబీసీ విభాగంలో మండల కేంద్రానికి చెందిన దూస చేతన్ ఆల్ ఇండియా 1319 ర్యాంక్ సాధించారు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మీనారయణ – రాజమని ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులే కావడం గమనార్హం. ఉత్తమ ర్యాంక్ సాధించిన చేతన్‌ను పలువురు అభినందించారు.

నిర్మల్ విద్యార్థి ప్రతిభ

- జాతీయ స్థాయిలో 708, ఎస్టీ కేటగిరీలో ఐదో ర్యాంకు కైవసం



స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని దివ్య నగర్‌కు చెందిన కున్సోత్ చంద్రసేన్ నాయక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌కు చెందిన కున్సోత్ సుదర్శన్, పద్మ దంపతుల కుమారుడు చంద్రసేన్ నాయక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 708 ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 5వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. తెలంగాణ ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయి 465, ఏపీ ఎంసెట్‌లో 263 ర్యాంకులు సాధించాడు. తండ్రి సుధార్‌సింగ్ లోకేశ్వరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా తల్లి పద్మ నిర్మల్ మండలంలోని వెంకటాపూర్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. చంద్రసేన్‌నాయక్ 1 నుంచి 5వ తరగతి వరకు స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో అభ్యసించగా, ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థలో చదువుకున్నాడు.

ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి ప్రతిభ



హర్షవర్ధన్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఆదిలాబాద్‌టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జిల్లా విద్యార్థి సాయి హర్షవర్ధన్ జాతీయ స్థాయిలో 1213వ ర్యాంక్‌తో సత్తా చాటాడు. 360 మార్కులకు 81మార్కులు కైవసం చేసుకున్నాడు. ఉపాధ్యాయుడు బేర దేవన్న –లక్ష్మీదేవి దంపతుల దత్త పుత్రుడైన సాయి హర్షవర్ధన్ ప్రతిభ కనబర్చడంపై పలువురు అభినందించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యాభ్యాసం చేశాడు.

సిక్కాతోనే హక్కుల సాధన



అభివాదం చేస్తున్న సిక్కా నాయకులు

- ఐదేళ్లకోసారి ప్రమోషన్ ఇవ్వాలి
- సిక్కా అధ్యక్షుడు బొల్లం మధుమోహన్

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్ (సిక్కా)తోనే క్లర్కుల హక్కులను సాధించుకుంటామని అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు బొల్లం మధుమోహన్ తెలిపారు. ఆదివారం సీసీసీలోని ఎస్వోపీఏ క్లబ్‌లో సిక్కా సింగరేణి స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని డివిజన్‌ల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1978లో క్లరికల్ హక్కుల సమస్యల పరిష్కారం కోసం సిక్కాను ఏర్పాటు చేశారన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల మధ్యకాలంలో కార్యక్రమాలు తగ్గిన నిర్వీర్యం మాత్రం కాలేదన్నారు. అధికారులకు ఇస్తున్నట్లుగా లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కల్పించాలని వివరించారు. గెలిచిన సంఘాలు మైన్స్ కమిటీ, ఏరియా కమిటీ, సెంట్రల్ 11 కమిటీలో సభ్యుల్లో క్లర్కులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అంతకు ముందు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ సిక్కాను బలోపేతం చేయడం కోసం అంతా కలిసి పని చేయాలన్నారు. ఈ సందర్భంగా 8 తీర్మాణాలను ఆమోదించారు.

శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడిగా సాంబయ్య

శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడిగా కన్నం సాంబయ్య, ఏరియా కార్యదర్శిగా కె.శ్రీధర్, కోశాధికారిగా జిల్లాల రవి, జాయింట్ సెక్రటరీగా జి.విజయలక్ష్మి, బద్రి బుచ్చయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా సుద్దాల శ్రావణ్ కుమార్, యస్.వాసవి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా నాగలక్ష్మి, మల్లేష్ కుమార్, ఏ.మహేష్, కే.సురేష్, ఈ.సురేష్, శివశంకర్, సురేష్‌లో పాటు అడ్వైయిజరీ కమిటీ సభ్యులుగా పెట్టం లక్ష్మణ్, డి.ముత్తయ్య, దుస్స పోశం, వి.రాధాకృష్ణలను ఎన్నుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ముస్క సమ్మయ్య, దుర్గాప్రసాద్, నాయకులు గోషిక మల్లేశ్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. వన్‌టౌన్ ఎస్సై రాములు వివరాల ప్రకారం... బస్తీలో నివాసం ఉంటున్న కొంక చంద్రశేఖర్ భవన నిర్మాణ రంగంలో కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాండూర్ మండలం ద్వారకా గ్రామంలో నివాసముంటున్న చంద్రశేఖర్‌తో బుట్టువు ఇంట్లో శుభకార్యానికి ఈ నె ల 14వ ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఆ దివారం చంద్రశేఖర్ ఇంటి తాళం పగిలి ఉండడంతో గమనించిన స్థానికులు సమాచారం అందించారు. వెంటనే ఇంటికి తిరిగివచ్చిన చంద్రశేఖర్ లోనికి వెళ్లి చూసే సరికి బీరువా పగులగొట్టి ఉండగా అందులోని రెండున్నర తులాల బంగారం, 34తులాల వెండి, రూ.32వేల నగ దు కాజేశారు. ఘటనాస్థలాన్ని వన్‌టౌన్ ఎస్సై పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.

బావపై యాసిడ్ దాడి

ముథోల్: బావపై యాసిడ్‌తో మరదలు దాడి చేసిన ఘటన మండలంలోని తరోడా గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గడ్‌పాలే మోహన్ ఈ నెల 13న తన ఇంటి బంగ్లాపై నిద్రిస్తున్న సమయంలో అతనిపై యాసిడ్ దాడి జరిగింది. అతను కేకలు వేయడంతో స్థానికులు, కుటుంబీకులు భైంసా ఏరియాసుపత్రికి తరలించారు. కేసు విచారణ అనంతరం ఎస్సై సాయికిరణ్ ఆదివారం వివరాలు వెల్లడించారు. బాధితుడి మరదలు కల్పనే నిందితురాలని పేర్కొన్నారు. కుటుంబ కలహాలకు, తరచూ ఇంట్లో గొడవలు కావడానికి మోహన్ కారణంగా ఉంటున్నాడని కల్పన యాసిడ్ దాడికి పాల్పడినట్లు వెల్లడించారు. ఆమెను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఆధార్ సమాచారం భద్రం

- దుర్వినియోగం కాకుండా రిజిస్ట్రేషన్ల శాఖలో చర్యలు



చివరి నాలుగు అంకెలు కనిపించేలా ఉన్న కార్డు

నేరడిగొండ: వినియోగదారుల సమాచారం ఆధార్ చాలా సంస్థలు, కంపెనీల్లో దుర్వినియోగం కావటం, తస్కరించి అమ్మకానికి పెట్టడం వంటి ఘటనలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం విక్రయ, కొనుగోలుదారులు, సాక్షులు సమర్పించే ఆధార్ వివరాలను గోప్యంగా ఉంచడానికి రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ చర్యలు చేపట్టింది. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఇటీవల ఉత్తర్వులు రాగా, ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఖానాపూర్, భైంసా, మంచిర్యాల, లక్సెట్టిపేట, ఆసిఫాబాద్‌లోని కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు. దస్తావేజుల్లో విక్రయదారులు, కొనుగోలుదారులు, సాక్షుల ఆధార్ కార్డు నంబర్‌లోని తొలి ఎనిమిది అంకెలు కనిపించకుండా, చివరి నాలుగు అంకెలే కనిపించేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన స్థిర, చరాస్తుల క్రయ, విక్రయదారులు తమ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు జతచేస్తారు. రిజిస్ట్రేషన్ చేసే ముందు వాటిని సబ్ రిజిస్ట్రార్ పరిశీలిస్తారు. ఆధార్ వివరాలు సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకున్నాక జిరాక్స్ ప్రతిపై మొదటి ఎనిమిది అంకెలు ఎవరికి కనిపించకుండా మార్కర్‌తో దిద్దుతున్నారు. ఆ తర్వాత దస్తావేజులు, ఆధార్ కార్డులను స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్రంలో ధరణి ప్రారంభమయ్యాక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు తహసీల్దార్ కార్యాలయాల్లోనే చేస్తున్నారు. ఆధార్ గోప్యత విషయంలో తహసీల్దార్లకు మాత్రం ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

వినియోగదారుల భద్రత కోసమే..

వినియోగదారుల సమాచారాన్ని భద్రంగా ఉంచడానికి మా శాఖ జాగ్రత్తలు తీసుకుంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఇలా నిర్వహిస్తున్నాం. ఆధార్ గోప్యత ఉండేలా చూస్తున్నాం.

– శ్రీరామరాజు, సబ్‌రిజిస్ట్రార్, బోథ్

'శాలీవాహన' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన కార్మిక సంఘం నాయకులు

పాతమంచిర్యాల: జిల్లాలోని పాతమంచిర్యాల శివారులోని శాలీవాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని పవర్‌ప్లాంట్ కార్యాలయంలో పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో యాజమాన్యంతో చర్చలు నిర్వహించామన్నారు. ప్లాంట్ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ 2022 డిసెంబర్‌తో ముగియడంతో ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేసి ప్లాంట్ మూసివేశారని, అనాటి నుంచి కార్మికులకు జీతాలు లేవని, కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, యాజమాన్యం సానుకూలంగా స్పందించిందన్నారు. కార్యక్రమంలో పవర్ ప్లాంట్ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ నాయకులు జి.ప్రకాష్, ఎడ్ల శ్రీనివాస్, ఆసరి రాజయ్య, ఆర్.తిరుపతి, పి.సత్యం, ఈసారపు శంకర్ పాల్గొన్నారు.

21న బీజేపీ బహిరంగ సభ



మాట్లాడుతున్న అగల్‌డ్యూటీ రాజు

శ్రీరాంపూర్:ఈనెల 21న లక్సెట్టిపేటలో బీజేపీ బహిరంగ సభ ఉంటుందని, ఈ సభకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతారని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అగల్‌డ్యూటీ రాజు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని లక్సెట్టిపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ ఉంటుందని వెల్లడించారు. తొమ్మిదేళ్లలో మోదీ పాలన, సంక్షేమ పథకాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. 2018లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, ఇప్పుడు కొత్త హామీలతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సింగరేణి కార్మికులకు రూ.700 కోట్లు బోనస్ ఇవ్వనున్నట్లు మంచిర్యాల సభలో ప్రకటించిన కేసీఆర్ అవి తానిచ్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. ఇవి కార్మికులకు హక్కుగా రవాల్సిన వాటానే అని అన్నారు. కుంభకోణాల బీఆర్‌ఎస్ సర్కార్‌ను గద్దెదించి బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నస్పూర్ ఇన్‌చార్జి మల్లికార్జున్, దళిత మోర్చా పార్లమెంట్ ఇన్‌చార్జ్ పానుగంటి మధు, నస్పూర్ పట్టణ ప్రధాన కార్యదర్శులు సత్రం రమేశ్, ఈర్ల సదానందం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, నాయకులు సిరికొండ రాజు, పాషా, రమేశ్, బద్రి శ్రీకాంత్, సుమన్ పాల్గొన్నారు.

మరోసారి గెలిపించాలి

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ.వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

శ్రీరాంపూర్: రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో మరోసారి యూనియన్‌ను గెలిపించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు సూచించారు. ఆదివారం కొత్తగూడెంలోని ఎల్లందు క్లబ్‌లో టీబీజీకేఎస్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనియన్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో, గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో సింగరేణి కార్మికులకు ఏ దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేనటువంటి హక్కులను కల్పించినట్లు తెలిపారు. కార్మికుల కోసం సాధించిన హక్కులతో మరోసారి గెలుస్తామన్నారు. ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఆర్‌ఎల్సీ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఎన్నికల షెడ్యూల్ ఖరారు కానుందన్నారు. అనంతరం టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు గతంలో ఏ గుర్తింపు సంఘం చేయని మేలు, హక్కులు, సదుపాయాలను టీబీజీకేఎస్ కల్పించిందన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు డి.అన్నయ్య, బడికెల సంపత్, నూనె కొమురయ్య, మంద మల్లారెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి చాట్ల అశోక్, సామ్సన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల కోసం ప్రాణాలర్పించిన ధన్యజీవి సుదర్శన్



సుదర్శన్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న వివేక్

బెల్లంపల్లి: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజల కోసం ప్రాణాలు త్యాగం చేసిన గొప్ప ధన్యజీవి సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ గడ్డం వివేక్ అన్నారు. ఆదివారం రాత్రి బెల్లంపల్లికి వచ్చిన ఆయన కొత్త బస్టాండ్ ఏరియాలో నివాసముంటున్న సుదర్శన్ సోదరుడు కటకం సతీష్‌కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. సుదర్శన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ... సుదర్శన్ తుది శ్వాస వీడే వరకూ తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేశాడని అన్నారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మునిమంద రమేష్, అందుగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తిరుపతి, హరీష్‌గౌడ్, బెల్లంపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు కోడి రమేష్, నాయకులు రాజలింగు, రాజనర్సు, శ్రీనివాస్, సంతోష్, ఎరుకల శ్రీనివాస్, రాములు, లక్ష్మణ్, గోవర్ధన్, సునీల్, విజయ్ ఉన్నారు.